5.8.1994 శుక్రవారం, 10 పేజీలు, సంపుటి: 66, సంచిక: 30, విడిప్రతి : రు. 2.00లు

Phone : 27354 Regd. No. HNL. 18

# జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

**శుభాకాంక్షలు**

అమెరికా యాత్ర విజయవంతంగా పూర్తిచేసుకొని స్వదేశానికి

విచ్చేసిన

**శ్రీజెవి రెడ్డిగారికి**

హృదయపూర్వక శుభాకాంక్షలు

రొటేరియన్ డి.సి హరిబాబు

నెల్లూరు ఫోన్ : 28659

# ఏకాకి అవుతున్న 'ఏకైక' నాయకుడు!

**క్రమంగా కోట్ల ఒంటరి వాడవుతున్నాడు ఎన్నికలు దగ్గరయ్యే కొద్దీ మిత్రులు కూడా శత్రువులవుతున్నారు. పార్లమెంట్ సభ్యులు తిరుగుబాటు ధ్వజం ఎత్తారు. నాయకత్వం మారాలని ముగ్గురు ఎం.పి.లు పి.వి. వద్దకు రాయబారం కూడా వెళ్లారు. రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యమంత్రి సరికొత్త వైర వర్గాన్ని సృష్టించుకొంటున్నాడు.**

ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర రెడ్డి ఏకాంత ద్వీపంలో ఒంటి స్తంభపు రాజకీయ మేడ కట్టుకొంటున్నాడు. అందులో చిటారు అంతస్థును తన కొక్కడికే రిజర్వ్ చేసుకుంటున్నాడు. ఆప్త బంధువులు, వందిమాగధులు, చెక్క భజన రాయుళ్లకు తప్ప, మరెవరికీ అందులో ప్రవేశం దొరకదు. హితవరులైతే 'ప్రైక్లీ ప్రొహిబిటెడ్'. ఎన్నికలు దగ్గరయ్యే కొద్దీ విజయ భాస్కర రెడ్డిలో ఈ వింత ధోరణి పెరగడం సహజంగానే కాంగ్రెస్ వారిని, మరీ ముఖ్యంగా ప్రజా ప్రతినిధుల్ని కలవర పరుస్తున్నది. మంచి కోరే వారిని, కలిసి పోవాలనుకునే వారిని కూడా దూరం చేసుకుంటే ఇక పార్టీ గతేమి టన్న ప్రశ్న వారిని వేధిస్తున్నది. ఇప్పటికీ కోట్ల వారు తన పాత ఫ్యూడల్ వాసనలను వదలు కోలేక పోవడం వారికి ఆశ్చర్యాన్నే కాదు, ఆందోళనను కూడా కలిగిస్తున్నది.

దీనికి ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర పర్యటన ఒక తాజా ఉదాహరణ. ముఖ్యమంత్రి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించాలని అనుకొన్నది మొదలు అది వివాదాంశమే అయింది. పార్లమెంట్ సభ్యులకు తెలియ జేయకుండా పర్యటన రూపొందిస్తే వివాదం కాక మరే మవుతుంది? పైగా విశాఖ జిల్లాలో పలుకు బడి గట్టిన పార్లమెంట్ సభ్యుడు ద్రోణం రాజు సత్యనారాయణ కోట్లకు కాని వాడేం కాదు. ఆయన డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డికి సన్నిహితుడైనా, కోట్లకు కూడా హితుడుగా ఇద్దరి మధ్య రాయబారాలు నడుపు తున్నవాడు. అంతటి ముఖ్యుణ్ణి ముఖ్య మంత్రి నిర్లక్ష్యం చేశాడంటే ఏమను కోవాలి? పైగా ద్రోణంరాజుకు తెలియ జేయలేదేమని అడిగితే 'విశాఖ - ఆయన జాగీర్దారేం కాదని' ముఖ్య మంత్రి కట్టె విరిచినట్టు సమాధానం చెప్పాడు. మిత్రుల్ని కూడా శత్రువుల్ని చేసుకోడానికి ఇంత కంటే గొప్ప చాక చక్యం ఏం కావాలి!

ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర పర్యటన విజయవంత మైందనడంలో సందేహమేం లేదు. ఐతే అది అధికార పర్యటనగా మాత్రమే విజయవంతమైంది. రాజకీయ పర్యటనగా విఫల మైంది. విఫలం కావడం వరకే అయితే ఫర్వాలేదు, విపత్కర పరిణామాలకు కూడా దారి తీసింది. పార్లమెంట్ సభ్యులు ద్రోణంరాజు సత్యనారాయణ, కొణతల రామకృష్ణ, కణితి విశ్వనాథం ముఖ్యమంత్రి సభలను 'బాయ్‌కాట్' చేశారన కూడదు గానీ, పిలవని పేరంటం మా కెందుకు లెమ్మన్నట్టు దూరంగా వుండి పోయారు. ఎప్పుడైతే ద్రోణం రాజు వర్గం ముఖ్యమంత్రికి దూరమైందో, అప్పుడే 'గుడివాడ' వర్గం ముఖ్యమంత్రికి దగ్గరైంది. నిజానికి గుడివాడ గుర్నాధరావు, మంత్రి సాంబశివరాజు, 'ఉడా' అధ్యక్షుడు సూర్రెడ్డికి ముఖ్యమంత్రితో ఏమంత సన్నిహిత సంబంధాలు లేవు. వీరు జనార్దన రెడ్డి మిత్రులుగా ప్రసిద్ధి. ఐతే ముఖ్యమంత్రి ద్రోణంరాజు మధ్య సంబంధాలు చెడడం కంటే ఈ 'త్రయా'నికి కావల్సిందే ముంటుంది? ఆ అవకాశాన్ని చేజిక్కించుకొని వారు ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర పర్యటనను భుజాల మీద వేసుకొని మోశారు.

ద్రోణంరాజు అంత మాత్రాన్నే చేతులు ముడుచుకొనే రకం కాదు. ముఖ్యమంత్రి పర్యటనను ఎంతగా రచ్చ కెక్కించాలో అంతగానూ ఎక్కించాడు. నేరుగా ఢిల్లీకే ఫిర్యాదులు వెళ్ళాయి. రాష్ట్రానికి చెందిన ఎం.పి.ల సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి వైఖరిని వి. హనుమంత రావు, రామకృష్ణ, ద్రోణంరాజు తూర్పార బట్టారు. మల్లు రవి లాంటి ఒకరిద్దరు ముఖ్యమంత్రిని సమర్థించబోగా చెల్లుబాటు కాలేదు. 'విశాఖ పట్టణ మేరం ద్రోణం రాజు జాగీర్దారా' ని ముఖ్యమంత్రి చేసిన పుల్ల విరుపు వ్యాఖ్యకు ద్రోణంరాజు 'టిట్ ఫర్ టాట్' అన్నట్లు "ఈ రాష్ట్రమేం కోట్ల

కొరవ 10 పేజీలో

## మజ్జిరొట్టవిరిగి....?

పిసిసి అధ్యక్షుడు మజ్జి తులసీ దాస్ రొట్టె విరిగి నేతిలో పడేట్లుంది. మజ్జిని దించి, తనకు అనుకూలుణ్ణి పిసిసి పీఠం పై కూచో పెట్టాలని ముఖ్య మంత్రి కోట్ల చేస్తున్న భగీరథ ప్రయత్నం బెడిసి కొట్టే అవకాశం వుంది. ఇంత కాలం మజ్జిని వెనకేసు కొచ్చిన వారు లేరు; కానీ ఇప్పుడు ముఖ్య మంత్రి మీద తిరుగు బాటు జెండా ఎగ రేస్తున్న ఎం.పిలకు మజ్జి ముద్దొ స్తున్నాడు. పిసిసి అధ్యక్షుణ్ణి ఆరు నెలల క్రితమే మార్చి వుంటే ఫలితం వుండేదేమో కానీ ఎన్నికలు దగ్గర పడడం వల్ల యిప్పుడు మార్పు మంచి జరగదని వాళ్లు కొత్త వాదన లేవ నెత్తుతున్నారు. పిసిసి మార్పు కంటే ఎన్నికల కమిటీని ఏర్పరచడం అవసరమని వారు పి.వి.కి చెప్పు కొన్నారు. ఇదే సమయంలో పిసిసి పునర్ వ్యవస్థీకరణంటూ ముఖ్య మంత్రి కూడా పివి దర్శనం చేసు కున్నాడు. ఇప్పుడు పి.వి. ఎటు మొగ్గు తాడన్నది వేచి చూడాలి. ఆయన కోట్లను పూర్తిగా కాదన కుండా, ఎం.పి.లను పూర్తి అవున నకుండా మధ్యే మార్గం అనుసరించినా ఆశ్చర్యం లేదు.



**విదేశీయానం...**

ప్రముఖ కాంగ్రెస్ నాయకులు

ఆంధ్ర ప్రదేశ్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ ఛైర్మన్

ఆంధ్ర ప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు డైరక్టరు

**శ్రీ పూసల రంగయ్య, B.A., L.L.B. గారు**



బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ మున్నగు దేశాలలోని సహకార రంగాన్ని పరిశీలించి, అధ్యయనం చేయు నిమిత్తం 10.8.94 తేది బయలు దేరి వెళ్లు శుభ సందర్భములో వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

మిత్రులు, శ్రేయోభిలాషులు

